


# ఆకలి

ఆచంట శారదాదేవి

ఎండ మాడుతోంది తారురోడ్డు మీద కాళ్ళు అంటుకు పోతున్నాయి రెండు రోజులుగా తిండిలేక రామారావుకు ప్రాణం తడబడుతోంది అడుగు ముందుకు వెయ్య లేకపోతున్నాడు అయినా ఆ ఎండలో ఆగనూలేక భారంగా ముందుకు సాగుతున్నాడు ఆకలి దహించి వేస్తోంది ఆ ఆకలికి ముందూ వెనక, మంచీ చెడూ ఏమీ తెలియటం లేదు ఆకూ అలము చెట్టూ, చేమా ఏదయినా సరే కబళించి వేద్దామన్నంత తపనగా వుంది. మెదడులో ఒక్కటే ఆలోచన మెదులుతోంది ఎవ

రయినా పిలిచి విస్తరివేసి వడ్డిస్తే అన్నం పెడతారా? దిక్కులు చూస్తూ ముందుకు సాగాడు. ఇంక నడవడానికి కళ్ళు తిరుగుతున్నాయి. ఇంక కాస్త సాగితే నీరసించి పడిపోవచ్చు. ఎక్కడయినా కాస్సేపు కూర్చుంటే? ఎదురుగా ఉన్న ఇంటి అరుగు ఆకర్షించింది. అరుగు ఎత్తుగా విశాలంగా ఉంది. లోపల ఉన్న బాదం చెట్టు నీడ ఓ మూల కొద్దిగా పడుతోంది విస్త్రాణగా వెళ్ళి అక్కడ కూర్చున్నాడు. చొక్కాతో ముఖం తుడుచుకున్నాడు. కాస్త ప్రాణం కోలుకుంటూ న్నట్లని పించింది.

లోపల సందడిగా ఉంది ఏదో పండగ జరుగుతూన్నట్లుంది. గొడవగా గోలగా ఉంది. అందరూ ఏదో సందడిగా మాట్లాడు కుంటున్నారు. పిల్లలు అరుస్తూ ఆడుకుం టున్నారు. ఏదో విందు జరుగబోతూన్న ట్లుంది. ఈ పూట ఇక్కడ భోజనం దొరుకుతుందా? ఎవరయినా తనని పిలిచి అన్నం పెడితే? ఆశతో లోపలికి తొంగి చూశాడు.


"ఎవరది?" ఎవరో గట్టిగా అరచారు. ఒక వ్యక్తి బయటికి వచ్చాడు. అతన్ని చూసి ఆశ్చర్యంగా గొంతు తగ్గించి "మవ్వట్రా" అన్నాడు. రామారావు తెల్ల బోయి కాస్తతేరుకుని నిదానంగా చూశాడు. ఒకప్పుడు తన సహాధ్యాయి మధుసూదన రావు. ఇప్పుడీ స్థితిలో అతనికంట బడటం తనకెంతో అవమానంగా వుంది. దుమ్ము నిండిన బట్టలు, నీరసించిన శరీరం, నోరు తెరచి అన్నం అడుగవలసిన దైన్యం! కొయ్యబారి నోట మాటలేక వూరుకున్నాడు. అతను మళ్లా అడిగాడు. "ఎందుకురా ఇలా వచ్చావ్?"

కాస్త తేరుకుని రామారావు సమాధానం చెప్పాడు నీరసంగా "ఎండగా వుంది, కాస్సేపు కూర్చుంటాను."

మధు "సరె" అన్నాడు. నిర్లిప్తంగా లోపలికి వెళ్ళిపోతున్నాడు. "ఒరేయ్!" అన్నాడు రామారావు సగం వచ్చి. మధు వెనక్కి తిరిగి చూశాడు. "ఏంరా?" అన్నాడు.

రామారావు బిక్కమొహంతో అన్నాడు "ఈపూట ఇక్కడ భోజనం పెట్టిస్తావా?" ఆశతో అతని కళ్ళు ఒక్క క్షణం తళ తళా మెరిశాయి. మధు ముఖం తెల తెలా పోయింది. సందేహంగా అన్నాడు, "ఏమోరా, ఇది మా యిల్లు కాదు. వీళ్ళు మాకు తెలిసినవాళ్ళు. నేనూ ఇక్కడికి అతిధిగా భోజనానికి వచ్చాను. ఈ ఇల్లు గలాయనకు కొత్తగా పాప పుట్టింది. ఇవ్వాళ బారసాల జరుగుతోంది. ఇంకా విందు భోజనాలవలేదు."

రామారావు ముఖం నిరాశతోనిండింది. మధు మళ్ళా అన్నాడు. "అయినా కాసేపు కూర్చో. వీలు చూసి మళ్లా చెబుతాను" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు. రామారావులో మళ్ళా కాస్త ఆశ మొలకెత్తింది. అన్నం పెడతారేమోనన్న ఆశ కలగ్గానే




ఆకలి రెండింతలై భరించలేనంతయింది. తట్టుకోలేని తపన పడుతూ గోడకు జార్లబడి కూర్చున్నాడు.

ఏవో ఆలోచనలు సాగుతున్నాయి. తను పట్టభద్రుడై మూడేళ్ళయింది. మూడేళ్లుగా వుద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఎక్కడా దొరికే అవకాశం కనబడలేదు. తిరిగి తిరిగి ఉన్నది కాస్త ఖర్చు కావడం, మనస్సు శిధిలం కావడం మిగులుతోంది. ఇంట్లో ముసలి తల్లి తనూ తప్ప ఇంకెవరూ లేరు. తండ్రి చిన్నప్పుడే పోయాడు. ఉన్న రెండు ఎకరాలు అమ్మి తల్లి తనకు చదువు చెప్పించింది. అందరితో తన బాధ్యత తీరినట్లు, ఇక భారమంతా రామారావుదే అన్నట్లు, కాళ్లు చాపుకు కూర్చుంది. అవును అంతకన్నా ఆమె ఏం చేస్తుంది? ఇంక పోషణ భారమంతా తనదే. తనూ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. ఎక్కడయినా జవాను పనైనా దొరికితే చేద్దామని. కాని ఏం లాభం? అది కూడా యిప్పించేవాళ్లు లేరు. తనకు బంధువర్గంలో ఎవరూ వుద్యోగస్థులు లేరు. ఆదుకునేవాళ్ళులేరు. ఈలోగా ఇంట్లో ఒక్కొక్క వస్తువూ అమ్మకు తినటమవుతోంది గిన్నెలు గరిటలు కూడా కంటికి కనిపించకుండా పోతున్నాయి. మొన్న రెండు రోజులు బియ్యం లేక అమ్మ చిలకడ దుంపలు వుడకబెట్టి పెట్టింది. అవి ఒకరోజు తిన్నాడు. కడుపు నొప్పి వచ్చింది. మళ్ళా సయించలేదు. అప్పుడెప్పుడో కంద మూలాలు మాత్రం

తిని మరి మహర్షులంతా ఎలా సంతోషంగా తృప్తిగా బ్రతికారో? తనకు ఆ దుంపలు సరిపడలేదు. ఇంట్లో వుండి పూరికే అమ్మపడే బాధ చూడలేక, ఏమీ చెయ్యలేక రెండు రోజులుగా ఇల్లు వదిలి పెట్టి తిరుగుతున్నాడు. తిండిలేక నిద్రలేక ప్రాణం కడబట్టింది.

ఎవరో వచ్చి వీధి తలుపు వేశారు. లోపల వడ్డన జరుగుతోంది. భోజనాలు చేస్తున్నట్టున్నారు. వంటల వాసన వాకిట్లోకి వస్తోంది. రామారావుకు ఆకలి ఎక్కువై తపన ఎక్కువయింది. అలా అందరూ ఆనందంగా లోపల భోంచేస్తూ వుంటే తాను ఒక్కడూ అలా ఎవరైనా తన్ను కూడా భోజనానికి పిలుస్తారేమోనని ఆశపడుతూ ఎదురు చూస్తూ కూర్చోటం ఏదో అవమానంగా, చిన్నతనంగా ఉంది. అతన్ని ఎవరూ పిలవలేదు. కాస్సేపటికి భోజనాలు పూర్తయాయి. కాస్త సద్దు మణిగింది. అందరూ తాంబూలాలువేసి స్తూ కాస్త మౌనంగా భుక్తాయాసం తీర్చుకుంటున్నారు కాబోలు! ఎవరో వచ్చి ఎంగిలాకులు బైట పడవేసి వెళ్లారు. వాకిలి అంతా మురికిగా వుంది. ఇంక ఆ అరుగు మీద కూర్చోటానికి అసహ్యంగా వుంది. ఎంతకూ తన స్నేహితుడు మళ్లా బయటకు రాలేదు. చాలాసేపు ఎదురు చూసి ఆగలేక తానే లేచి నీరసంగా లోపలకు ఒక్క అడుగు వేశాడు. అడుగు పెట్టగానే ఎవరో కర్కశంగా ఒక్క అరుపు అరచారు. "ఎవరు నువ్వు?" అని. అతనికేం మాట్లాడాలో తెలియలేదు. తడబడుతూ అన్నాడు, "మధు భోజనం పెట్టిస్తానన్నాడు" అని. ఆ వ్యక్తి ఎవరో మళ్లా అరచాడు. 'ఇప్పుడేమి భోజనం! ఇక్కడ అందరి భోజనాలు అయినాయి. ఇప్పుడేం లేదు వెళ్లు' అని. రామారావుకు గొంతులో వుండ చుట్టినట్లయింది. మాటరాలేదు. మధు లోపల ఎక్కడ వున్నాడో? అతని కోసం ఎదురు చూడాలని కూడ తోచలేదు. నిస్పృహతో బయటకువచ్చి తోవ పట్టాడు.

"ఎక్కువ కాలం బ్రతకదలచుకుంటే ఆహారము విషయంలో విధిగా నియమాల్ని పాటించవలెను."

—ఫ్రాంక్లిన్.

నీరసంగా అడుగులు వేస్తూ ముందుకు సాగాడు. పరాయి ఇంటి ముందు పట్టెడన్నం కోసం ప్రాధేయపడి నిస్పృహ, అవమానము పొందిన తన పేదరికానికి మనసు కుమిలింది. కళ్ళల్లో నీరు తిరిగింది.


కాస్త దూరంలో ఒక మర్రిచెట్టు వుంది. క్రింద నీడ విశాలంగా, చల్లగా వుంది అక్కడకు వెళ్ళి చతికిల బడ్డాడు. ఆ చెట్టు కింద, ఆ ఎండలో ఓ ముసలిది కూర్చుని ఉంది. జుట్టంతా నెరసిపోయి చింపిరి చింపిరిగా వుంది ఒక పన్నైనా వుందో లేదో ఒట్టి బోసినోరు. ఒళ్ళంతా

చర్మం వడిలిపోయి ముడతలు పడి ఉంది. ముందర ఒక గోనె సంచి మీద అరటి పళ్ళు రెండేసి రెండేసి కుప్పలుగా పేర్చింది. అవి అమ్ముతుంది కాబోలు? ఆ పళ్ళు నల్లగా వాడిపోయి వున్నాయి. అయినా అవి కొనుక్కోవాలన్నా తన దగ్గర దమ్మిడీ లేదు. అతన్ని చూసి అవ్వ అడిగింది, ''పళ్ళు బాగా లేదా?'' అని. అతనన్నాడు: ''అది కాదు ఆకలి వేస్తూంది'' అని. ఆమె రెండు పళ్ళు తీసి చేయ్యి ముందుకు చాపింది. ''ఇదిగో ఇవి తిను'' అన్నది ఆప్యాయంగా. అతను పళ్ళందుకున్నాడు ఆప్యాయంగా. సందేహిస్తూ అన్నాడు ''నా దగ్గర డబ్బు లేదు.'' ఆమె లక్ష్యపెట్టలేదు. నిర్లక్ష్యంగా అన్నది. ''పోనివ్, మళ్ళా ఇద్దువులే'' అతను ఆ పళ్ళు తిన్నాడు. కాస్త ప్రాణం కుదుటబడింది. అవ్వ తన పక్కనున్న చెంబుతో నీళ్ళు యిచ్చింది. అతను తాగాడు గడగడా ఎన్నడూ నీళ్ళ రుచి ఎరగనట్లు! అతను అన్నాడు. ''మళ్ళా వస్తాను. నీ డబ్బులు తెస్తాను'' అని. ఆమె ఆప్యాయంగా నవ్వింది. అతనికి అప్పుడప్పుడు తన తల్లి తనకేసి ఆప్యాయంగా ప్రేమగా చూడటం గుర్తు వచ్చింది. మెల్లగా లేచి వెళ్ళిపోయాడు, మనస్సులోనే అవ్వకి నమస్కరించుకుంటూ!

* * *

అది జరిగి ఏడాదయింది. ఆ తరువాత అతనికి వుద్యోగం దొరికింది. వంద రూపాయలు జీతం. ఇప్పుడు ఉపవాసాలు చెయ్యనక్కరలేదు. ఆకలితో అలమటించనక్కర లేదు. వచ్చే జీతం ఒక్కపూట భోజనానికి సరిపోతుంది. పోషించవలసిన వాళ్లూ లేరు. తల్లి పోయింది. తాను ఒక్కడూ! ఏదో పగలంతా పనితో సరిపోతుంది. రాత్రి ఒంటరితనంతో ఆలోచనలతో గడుస్తుంది. శరీరానికి ఆకలి బాధ పోయింది. అది ఇంక బాధ పెట్టటంలేదు. కాని మనస్సుకు విపరీతమైన ఆకలి పెరిగింది. అది క్షణం ఊరట నివ్వటం లేదు. ఈ జీవితంలో ఎన్నో రకాల ఆకళ్ళు! అన్నం కోసం ఆకలి, స్నేహం కోసం ఆకలి ఒంటరితనం భరించలేక మరొక ప్రాణి కోసం ఆకలి, ఆవేదనలతో శిథిలమయ్యే మనస్సుకు ఆప్యాయత కోసం ఆకలి, ఎన్ని ఉన్నా ఏదో రకమైన ఆకలి బాధిస్తూనే వుంటుంది. శాంతి లేదు. అమ్మ పోయినప్పటి నుంచి అతనిని ఒంటరితనం బాధిస్తోంది. తినడానికి తిండి ఉన్నా, మనస్సుకు వుల్లాసం లేదు. అప్పుడప్పుడు ఆ అరటి పళ్ళిచ్చిన అవ్వ గుర్తుకు వస్తుంది. ఆమె కళ్ళల్లో కనిపించిన ఆప్యాయత ఏదో మనస్సుకు చల్లగా ఊరటగా ఉంటుంది.

ఒకరోజు ఆ చెట్టు దగ్గరకు వెళ్లాడు. ఆమెకు ఆ పళ్ళ ఖరీదు రెండణాలు ఇవ్వాలని ఎన్నాళ్ళగానో అనుకుంటున్నాడు. కాని పడలేదు. ఆవేళ ఆ చెట్టు దగ్గర అవ్వలేదు. ఎవరో చిన్న కుర్రవాడు




వున్నాడు. నల్లగా బక్క చిక్కి వున్నాడు. మాసిన చొక్కా, పొట్టిగా పొట్టనాకా వుంది. క్రింది భాగమంతా నగ్నమే! ఒక్కడూ మట్టిలో ఆడుకుంటున్నాడు. రామారావు దగ్గరగా వెళ్ళి అడిగాడు: "ఇక్కడ అరటిపళ్ళు అమ్ముతూ ఓ అవ్వ వుండేది. ఏదీ?" అని. ఆ కుర్రాడు తెల్లబోయినట్లు చూశాడు.

"ఏమో తెలవదు" అన్నాడు సంక్షిప్తంగా. రామారావుకు నిరాశ కలిగింది. ఇంత ఊళ్లో ఇప్పుడా అవ్వను ఎక్కడని వెతికి పట్టుకోవటం? అసలు బ్రతికి వుందో లేదో? శాశ్వతంగా ఆ అవ్వకు రెండణాలు బాకీ వుంటాడు కాబోలు! నిస్పృహతో వెనక్కు మళ్లాడు. ఆ కుర్రాడు దీనంగా పిలిచాడు, "బాబూ." రామారావు ఒక్క క్షణం ఆగి కుర్రాడికేసి చూశాడు.

"బాబూ, ఒక్క అణా ఇయ్యి."

"ఎందుకూ" అన్నాడు అతను.

"ఆకలి__"

అతను సంతోషంగా చేతిలో వున్న రెండణాలు ఆ కుర్రాడి చేతిలో పెట్టాడు. ఆ పిల్లవాడి ముఖం వెన్నెల కాంతితో వెలిగింది. వాడి ఆనందానికి అంతులేదు. ఆ క్షణం రామారావుకు అవ్వ బోసి నోటితో ఆప్యాయంగా నవ్వుతున్నట్లనిపించింది. అతని మనస్సు తేలిక పడింది. •